మల్లన్న భూములపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి

మాట్లాడుతున్న అందె బీరన్న

చేర్యాల, జూన్ 13 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ.60కోట్ల విలువైన భూములకు ప్రహరీ నిర్మిస్తే కాంగ్రెస్ సర్కారు వచ్చిన 6 మాసాలకే వాటిని కూల్చి అక్రమిస్తున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె బీరన్న ఆరోపించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఆలయ అధికారులతో కుమ్ముకై గోడలు కూల్చివేశారని తెలిపారు. మల్లన్న ఆలయ భూముల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎడ్ల గురువారెడ్డికి ఘన నివాళి

ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మంజూలా రాజనర్సు

సిద్దిపేట, జూన్ 13 : విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు సిద్దిపేట తొలి ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం 13వ వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రాజనర్సుతో కలిసి సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ పార్కులో గల గురువారెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాయుధ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. గురువారెడ్డి ఆశయాలను సీపీఐ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, స్థానిక కౌన్సిలర్ సాయిశ్వర్ గౌడ్ సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు తిరుమల్ రెడ్డి, చిప్ప ప్రభాకర్, కిష్టాపురం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలయంలో వేడుకలు

కృష్ణాలయంలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సిద్దిపేట టౌన్, జూన్ 13 : సిద్దిపేట కృష్ణాలయ 31 వార్షికోత్సవ మహోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సుందర్ సత్సంగ్ ఆధ్వర్యంలో ఆలయంలో తెల్ల వారు జామునుంచి స్వామి వారికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం ప్రత్యేక పూజలు ఇలా తదిర పూజలతో స్వామిని కొలిచారు. అనంతరం ఆలయ సెక్రటరీ బచ్చు రమేశ్ ఆలపించిన భక్తి గీతాలు, భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. 30 ఏండ్లుగా సుందర్ సత్సంగ్‌లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ అధ్యక్షురాలు విజయ, వైస్ ప్రెసిడెంట్ అయిత కేదార్నాథ్ తెలిపారు. ఉత్సవాల్లో సిద్దిపేట మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ బచ్చు సుజాత రమేశ్, సభ్యులు గంగారం, మల్లికార్జున్, సత్యం, తిరుపతి, బాల్‌రాజ్, విజయ కుమార్, జగదీష్‌శ్వర్, నరసయ్య ఉన్నారు.

తైబజార్ వేలం పాట వాయిదా

జగదేవ్‌పూర్ జూన్ 13 : జగదేవపూర్ మేజర్ గ్రామపంచాయతీ పశువుల సంత, తైబజార్‌కు నిర్వహించనున్న వేలం పాట వాయిదా వేసి శుక్రవారం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి డీఎల్పీవో లత సూచించారు. గురువారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేలం పాట నిర్వహించదలచినప్పటికీ దరావత్తు విషయంలో గొడవ జరిగడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు వరకు దరావత్తు అంగడి రహదారి పశువుల సంతకు రూ. లక్ష, తైబజార్‌కు రూ. 50వేల దరావత్తు పెట్టి వేలంలో పాల్గొనాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు పారిశుధ్య సమస్యలు లేవనెత్తగా వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేసి మంచి నీరు సరఫరా చేయాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీటీసీ కవిత, మాజీ సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, సీఏ మారెడ్డి, సిబ్బంది బాలయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు

హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 13 : హుస్నాబాద్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ అన్నారు. గురువారం మద్దూరు పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. శాంతిభద్రతలపై సమీక్షించి, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా వరకు భూ పంచాయతీలు ఉత్పన్నమవుతున్నాయని, వీటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు పోలీసులు ప్రత్యేకంగా ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయించిన వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలన్నారు. అనంతరం మద్దూరు, ధూళిమిట్ట గ్రామాలకు చెందిన వీరేశం, తుషాలపురం పవన్ తమ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోవడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తెలుసుకొని వాటిని బాధితులకు ఏసీపీ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో చేర్యా ల సీఐ శ్రీను, ఎస్సై షేక్ యానుస్ అహ్మద్ అలీ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చేర్యాల, జూన్ 13 : బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, గ్రామ శాఖ అధ్యక్షుడు పాల బాలరాజు తెలిపారు. మండలంలోని ఆకునూరు గ్రామ శివారు మాసిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కత్తి వేణు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. అనంతరం కత్తి వేణు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేయడంతో పాటు ఆయన మృత దేహం వద్ద నివాళులర్పించారు. నాయకులు సోషల్ మీడియా ప్రతినిధులు ముచ్చాల వంశీ, మల్లమారి నవీన్, నాయకులు కోతి ఆంధ్రయ్య, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బాలమల్లు సేవలు మరువలేనివి

కోహెడ జూన్ 13 : కోహెడ మండలం సీపీఐ మాజీ కార్యదర్శి వేల్పుల బాలమల్లు మృతి మరువలేనిదని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బాలమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం చాడ వెంకట్‌రెడ్డి సముద్రాల్లో బాలమల్లు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల మల్లు పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. నిరంతరం పేదల పక్షాన పోరాటం చేశారన్నారు. నమ్ముకున్న పార్టీ కోసం ఆహర్నిషలు కృషి చేసిన వ్యక్తి అన్నారు. పార్టీ కోసం ఎల్లవేళలా పార్టీకోసం కృషి చేసిన బాలమల్లు కుటుంబాన్ని అదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యులు కనుకుట్ల శంకర్, నాయకులు లక్ష్మణ్, ముంజ గోపి, జేరిపోతుల జనార్దన్, జిల్లా కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, తాల్లపెల్లి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 13 : రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన కొనసాగాల్సిన అవసరం ఉందని, ఏక పక్ష నిర్ణయాలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే గతంలో లాగే ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో పాటు సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఆగస్టు 15 లోపు రుణ మాఫీ చేయాలని కాంగ్రెస్ సర్కారుకు సూచించారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా సీపీఐ పనిచేస్తుందని తెలిపారు. సమావేశం లో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు వనేశ్, సత్యనారాయణ, శంకర్, లక్ష్మ ణ్, గూడ పద్మ, భాస్కర్, గోపి, సంజీవరెడ్డి, సుదర్శనాచారి పాల్గొన్నారు.

తాత్కాలిక బస్టాండ్ కోసం మార్కెట్ పరిశీలన

కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి

గజ్వేల్, జూన్ 13 : గజ్వేల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న బస్టాండ్ పనులు నిలిచిపోవడంతో ప్రయాణికుల అవసరాల దృష్ట్యా పక్కనే ఉన్న కూరగాయల మార్కెట్‌ను గురువారం మార్కెటింగ్ శాఖాధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. బస్టాండ్ నిర్మాణంలో ఉండడంతో రోడ్లపై బస్సులు నిలుపడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తాత్కాలికంగా బస్సులు సమీకృత కూరగాయల మార్కెట్‌లో నిలిపితే ఎలా ఉంటుందనేది తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జాయింట్ డైరెక్టర్ పద్మ హర్ష, డీఈఈ మహేందర్, డీఎంహెచ్ నాగరాజు, సెక్రటరీ జాన్‌వెస్లీ, మాజీ మున్సిపల్ వైర్మన్ భాస్కర్, నాయకులు నరేందర్‌రెడ్డి, బోస్, రమేశ్, సమీర్, చారి తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు ఇవ్వాలి

గజ్వేల్, జూన్ 13: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పెంచిన రూ.300ను నేటికి ఇవ్వడం లేదని హామీగానే మిగిలిపోతుందని, కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. గురువారం మండల పరిధిలోని బెజుగామలో పని ప్రదేశానికి వెళ్లిన సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో 736 మంది కూలీలుండగా ప్రతి రోజు 200పైచిలుకు మంది పనులు చేస్తున్నరని, మిగతా వారు వేతనాలు సకాలంలో రాక పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. గతేడాది చేసిన పనులకు సంబంధించిన డబ్బులు గ్రామానికి చెందిన బెజుగామ లావణ్య, పరుస బాలవ్వ, మల్లేశ్, వంక మల్లవ్వ, చేకూరి లక్ష్మమ్మ, నాగరాజులకు రావపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నరన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

సలాఖపూర్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

హుస్నాబాద్ టౌన్, జూన్ 13 : సీజనల్ వ్యాధులు ముంచుకొస్తున్న తరుణంలో తగిన జాగ్రత్తలు చేపట్టాలని మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, వైద్య,ఆరోగ్య సిబ్బంది, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలతో గురువారం సీజనల్‌వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఆకుల రజితవెంకన్న మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కూలర్లు, పనికిరాని టైర్లలో నీటినిల్వలు ఉంటాయని వాటిని గుర్తించి తొలిగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, వైద్యురాలు నిఖిత, కౌన్సిలర్లు బొజ్జ హరీశ్, కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, దొడ్డి శ్రీనివాస్, కో-అప్షన్ సభ్యుడు అయూబ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవితతోపాటు పలువురు ఉన్నారు.

మద్దూరులో..

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 13 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని సలాఖపూర్, రేబర్తి గ్రామాల్లో అంటు వ్యాధులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు మాధవ్ జాదవ్, కిరణ్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ పుట్టిన రోజు వేడుకలు

జగదేవ్‌పూర్‌లో ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

జగదేవ్‌పూర్ జూన్ 13 : ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయంలో వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ దేవాలయంలో మండల నాయకులు రంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్, ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు పాల్గొని జై బీఆర్ఎస్ జై ప్రతాపన్న అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, కొండపోచమ్మ దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, నరేశ్, ఇంద్రసేనారెడ్డి మండల కో -ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, ఎంపీటీసీ కవిత, నాయకులు సత్యం, రాజు, ఐలయ్య, యాదవరెడ్డి, జితేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, జూన్ 13 : ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ గౌడ్, అహ్మద్, నిజాం, ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

వంటేరు ప్రతాప్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న మాదాసు శ్రీనివాస్

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

హుస్నాబాద్, జూన్ 13 : హుస్నాబాద్ పట్టణంలోని యేనెపై రూ.2 కోట్ల నిధులతో నిర్మిస్తున్న బంజారా భవన్‌కు వెళ్లే దారిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి దారి లేకుండా చేస్తున్నారని, ఈ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. బంజారా భవన్ నిర్మాణానికి కొందరు బడా నాయకులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఈ విషయమై సంబంధిత అధికారులకు, మంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఈ సందర్భంగా చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యం నాయక్, గిరిజన అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరన్న నాయక్, శ్రీనివాస్‌నాయక్, మాజీ కౌన్సిలర్ భూక్య లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్

ప్రమాద స్పాట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట టౌన్, జూన్ 13 : రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అన్నారు. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధి సిద్దిపేటలో తరుచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సీఐ రామకృష్ణతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు త్వరలో కార్యచరణ రూపొందించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫి క్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై వినయ్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న హెచ్ఎం మీనాంజనేయులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్13 : ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురి విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన వంటేరు సిద్దారెడ్డి అందజేసిన నగదు ప్రోత్సాహక బహుమతులను హెచ్ఎం మాడిశెట్టి మీనాంజనేయులు అందజేశారు. 10జీపీఏ సాధించిన ధరావత్ గణేశ్‌కు రూ. 10వేలు, 9.7 జీపీఏను సాధించిన బర్మ అభిరామ్‌కు రూ.5వేలు, 9.0జీపీఏను సాధించిన ఆరె మంజునాథ, బోదాసు అఖిల, నందనబోయిన అంజలిలకు రూ. 2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఏఏపీసీ చైర్మన్ సుజాత, పీఎస్ ఏఏపీసీ చైర్మన్ రజిత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బండి పద్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావంతులై పాఠశాలకు పేరు తీసుకురావాలి

హుస్నాబాద్ బాలుర ఉన్నతపాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీలో ప్రజాప్రతినిధులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 13 : ఉపాధ్యాయుల బోధనలతో మంచి విద్యావంతులై పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు సూచించారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. సకాలంలో విద్యార్థులందరికీ నోట్, పాఠ్యపుస్తకాలతోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనలతో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నా రు. మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బెజ్జంకి వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు కొండ్లె వాసుదేవరెడ్డితోపాటు పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

కోహెడలో..

కోహెడ, జూన్ 13 : ప్రైవేటు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని కోహెడ ఎంపీటీసీ ఖమ్మం స్వరూప అన్నారు. గురువారం కోహెడలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేసి మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అందించే విద్యకన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్య మెరుగైందన్నారు. ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, ఉపాధ్యాయులు కిషన్, నాయకుడు వెంకటేశం ఉన్నారు.

టీచర్ ప్రమోషన్లలో గందరగోళం

సిద్దిపేట అర్బన్, జూన్ 13 : ప్రస్తుతం జరగుతున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లలో గందరగోళం నెలకొన్నది. రిజర్వేషన్‌ల అంశంలో తనకు అన్యాయం జరిగిందని ఓ ఉపాధ్యాయుడు ఏకంగా సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. వివరాలోకి వెళితే.. మర్కూక్ మండలం పాముల పర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న కూరాకల శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుల ప్రమోషన్‌లో తనకు అన్యాయం జరిగిందని మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట కూర్చొని నిరసనకు దిగాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ కేటగిరిలో ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయుడు.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆ కేటగిరీ ఎస్సీగా మారింది. కానీ, ఎస్టీ కోటాలోనే ఆఉపాధ్యాయుడు ప్రమోషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడని ఆరోపించారు. తనకు ఎస్టీ కోటాలో స్కూల్ అసిస్టెం ట్ గణితంలో ప్రమోషన్ రాకుండా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. పూర్తి వివరాలు సేకరించి తగిన విధంగా ముందు కు వెళ్తామని శ్రీనివాస్‌కు చెప్పడంతో అతను నిరసన విరమించాడు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్టు

ములుగు, జూన్ 13 : బంగారం చోరీ కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం తెలిపారు. గురువారం ములుగు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం.. ఈనెల 11న ములుగు మండలం తునికి బొల్లారం గ్రామానికి చెందిన శ్యామల శంకరమ్మ (54) ఉదయం వాకింగ్ చేస్తుండగా ఆటోలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వచ్చి శంకరమ్మను తలపై సుత్తెతో గాయపరిచి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి పరారయ్యారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తుండగా, మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని ఓ జ్యువెల్లరీషాపులో అనుమానాస్పదంగా కనిపిస్తూ బంగారు పుస్తెల తాడు విక్రయానికి ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. అదుపులోకి తీసుకొని విచారించి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగలూర్ గ్రామానికి చెందిన నింగని రజనీకాంత్, ఇరగళ్ల యాదగిరి ఇద్దరు కలిసి చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకొని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీ పీ పురుషోత్తం తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వెంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

సిద్దిపేట టౌన్, జూన్ 13 : సిద్దిపేట మోహిన్‌పురా వేంకటేశ్వర ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త, చైర్మన్ రమేశ్ విష్ణు, ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్ శర్మ మాట్లాడుతూ భక్తులు 141 రోజుల్లో స్వామి వారికి కానుకల రూపంలో రూ. 9.28 లక్షలు సమర్పించి నట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ సహాయ కమిషనర్ శివరాజ్, అలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ దగ్ధం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 13 : మండలంలోని జిల్లెలగడ్డ సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని టిప్పర్ లారీ దగ్ధమైంది. భీమదేవరపల్లి మండలం ములకనూరు నుంచి హుస్నాబాద్‌లోని ఇటుక బట్టీలకు టిప్పర్ లారీలో పూడిక మట్టిని తరలిస్తుండగా జిల్లెలగడ్డ సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ లారీ దిగిపోగా స్థానికులు సమాచారం అందించడంతో ఫైరింజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటన